క్లుప్తంగా

ఆర్థిక సాయం



మంగపేట: మండలంలోని రమణక్కపేట పంచాయతీ పరిధిలోని పాతసినిమాహాల్ ప్రాంతానికి చెందిన ఇల్లెందుల రామారావు, ఉషారాణి దంపతులు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ ఆదేశాల మేరకు వైస్ చైర్మన్ నవీన్ గురువారం పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. కూలీపనికి వెళ్తేగాని పూట గడవని పరిస్థితుల్లో భార్య భర్త ఇద్దరు మంచానికి పరిమితం కావడంతో వారి దయనియ పరిస్థితిని తెలుసుకున్న ట్రస్టు నిర్వాహకులు రూ.3000 నగదును అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆదినారాయణ, గుమ్మల వీరస్వామి, ఇందారపు రమేష్, మునిగల మహేష్, చౌళం వేణువర్ధన్, గట్టిపల్లి అర్జున్, కొమరం శివాజీ, గ్రామస్తులు జగదీష్, సమ్మయ్య, లక్ష్మయ్య, కిరణ్, నాగసాగర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో చేరడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పానుగంటి శేఖర్ ఒక గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2023–24 సవత్సరానికి గాను మొదటి విడుతలో భాగంగా కోపాలో 48 సీట్లు, ఫిట్టర్‌లో 20 సీట్లు, ఎలక్ట్రీషియన్‌లో 20 సీట్లు, ఎలక్ట్రానిక్ మెకానిల్‌లో 24 సీట్లు, సివిల్ ట్రేడ్‌లో 24 సీట్లు కాళీగా ఉన్నట్లు తెలిపారు. మొదటి విడతలో భాగంగా జూన్ 10 వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని తెలిపారు.

రైతుబంధుకు..

కాటారం: కొత్తగా పట్టాదారు పాసుబుక్కులు పొందినవారు, గతంలో రైతుబంధుకు దరఖాస్తు చేసుకొని రైతులు, ఇతర కారణాల వల్ల బ్యాంక్ అకౌంట్ నంబర్ మార్చుకునే వారు సమీపంలోని రైతు వేదికలలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి గిరి రామకృష్ణ గురువారం ఒక ప్రకనటలో తెలిపారు. అలాగే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు సబ్సిడీపై స్థానిక పీఏసీఎస్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కిలో ధర రూ.80.20 కాగా సబ్సిడీపోను కిలోకు రూ.28.09 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక ఎకరాకు 12 కిలోల విత్తనం సరిపోతుందని కావాల్సిన రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

న్యాయం చేయాలని వినతి



ఏటూరునాగారం: మిషన్ భగీరథ కార్మికులకు న్యాయం చేయాలని కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాళ్ల రామకృష్ణ జెడ్పీ చైర్మన్ జగదీష్‌కు ఏటూరునాగారంలో గురువారం వినతిపత్రం అందించి కోరారు. ఐడీ కార్డులు కూడా ఇవ్వలేదని, తమను ప్రభుత్వం గుర్తించి జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, కమల్, వినోద్ పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన సురాబు రాజు జిల్లా కేంద్రంలో కోర్టులో పని చేస్తున్నాడు. కాగా విధులు ముగించుకుని చిట్యాలకు వస్తున్న నేపథ్యంతో ద్విక్రవాహనం ముందు ఉన్న టైర్ ఎండ తీవ్రతతో జడలపేట శివారులో పెలింది. దీంతో వాహనం అదుపు తప్పడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు 108కు సమాచారం అందించి సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

స్టార్టర్ దగ్ధం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పంచాయతీ పరిధిలోని పూస్కుపల్లిలో వరి పొలంలో నిప్పంటుకొని విద్యుత్ మోటార్ స్టార్టర్ పూర్తిగా దగ్ధమైంది. గురువారం కమటం రాజయ్య అనే రైతు పొలంలో నిప్పు అంటుకుని పొలంలో ఉన్న స్టార్టర్ దగ్ధమైంది. తనకు నష్టం జరిగిందని ఎవరైనా నిప్పంటిచారా..ప్రమాదశాత్తు అంటుకుందో తెలియదని రైతు వాపోయాడు.

చెరువుల పండుగ హాస్యాస్పదం

శాయంపేట: చెరువుల మరమ్మతులు చేపట్టకుండా చెరువుల పండగా చేయడం హాస్యాస్పందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. మండలంలోని జోగంపల్లి శివారులో గల చలివాగు ప్రాజెక్టు తూమును, పలు గ్రామాలలోని చెరువులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మూడు మండలాలకు త్రాగునీరు, సాగునీరు అందించే చలివాగు ప్రాజెక్టుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పండుగ దినోత్సవం జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ఏటూరునాగారం: వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి



ఎస్ఎస్ తాడ్వాయిలో ..



వెంకటాపురం(కె): బతకమ్మలతో ఊరేగింపు చేస్తున్న అధికారులు



వాజేడులో..



ఘనంగా చెరువుల పండుగ

వెంకటాపురం(ఎం): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల పండుగను గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. పాలంపేట గ్రామం నుంచి రామప్ప సరస్సుకట్ట వరకు ఐబీ డీఈ రవీందర్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీపతి, ఎంపీపీ బుర్ర రజిత, జెడ్పీటీసీ రుద్రమదేవి, తహసీల్దార్ మంజుల, సర్పంచ్ డోలి రజితలు బోనాలతో వెళ్లి చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ మేడబోయిన అశోక్ దంపతులు, ఎంపీటీసీ పోశాల అనిత వీరమల్లు దంపతులు బోనాలతో వెళ్లి లింగయ్యకుంట వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, ఎంపీటీసీ సభ్యురాలు జంగిలి శ్రీలత పాల్గొన్నారు.

మంగపేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలో చెరువుల పండుగ సంబురాల కార్యక్రమాన్ని మండల స్పెషలాఫీసర్ తుల రవి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మంగపేట, కోమటిపల్లి, మల్లూరు, నర్సింహసాగర్, రాజుపేట, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లోని చెరువుల వద్ద చెరువుల పండుగను నిర్వహించారు. సాయంత్రం 05 గంటల నుంచి 09 గంటల వరకు చెరువుల వద్ద బతుకమ్మ ఆట పాటలతో సందడి నెకొంది. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ వలీమ్ మొహమ్మద్, పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసర్లు పాల్గొన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల పండుగ ఉత్సవాలను గురువారం నిర్వహించారు. చెరువుల వద్ద కట్టమైసమ్మకు బోనాలు సమర్పించి యాటపోతులను మొక్కుగా సమర్పించారు. మండల కేంద్రంలోని నర్సింగాపురం గ్రామంలో కాంబోజ చెరువు వద్ద స్థానిక సర్పంచ్ ఇర్ప సునీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ, మండల స్పెషల్ ఆఫీసర్ అలెం అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎస్సై వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాజేడు: చెరువుల పండుగలో భాగంగా మండలంలో ఐదు చెరువులను గుర్తించిన అధికారులు ఆ చెరువుల వద్ద ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం మొరుమూరు గ్రామ పంచాయతీలోని మైసమ్మ చెరువు వద్ద ప్రత్యేక మొక్కులను చెల్లించారు. మొరుమూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి అధికారులు, ప్రజలు బతుకమ్మలు, బోనాలను మైసమ్మ చెరువు వద్దకు తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఆర్ఐ కాట రాజు, నీటి పారుదల శాఖాధికారులు పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం): పాలంపేట నుంచి బోనాలతో సరస్సుకట్టకు వెళ్తున్న ప్రజాప్రతినిధుల

వెంకటాపురం(కె):దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం అధికారులు మండలంలో ఘనంగా చెరువుల పండుగ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్, మండల ప్రత్యేక అధికారి అరవింద కుమార్, ఎంపీడీఓ అడ్డూరి బాబు, తహసీల్దార్ అంటి నాగరాజు, సర్పంచ్‌లు నర్సింహమూర్తి, చిడెం యామిలి, పూజారి ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయిపల్లిలో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రామస్తులు, అన్ని శాఖల అధికారులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం చిన్నబోయినపల్లిలో ఊరూర చెరువుల పండుగ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ నుంచి చెరువు వరకు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి హాజరై మాట్లాడారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ కుమార్, ఏపీఓ అంకూస్, సర్పంచ్ చేల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఐకేపీ, అంగన్‌వాడీ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మంగపేట: కట్టమైసమ్మకు వద్దకు బోనాలతో వెళ్తున్న మహిళలు, అధికారులు



వెంకటాపురం(ఎం)లో బోనాలతో చెరువు వద్దకు వెళ్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు



ఎస్ఎస్ తాడ్వాయిలో..

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కన్నాయిగూడెం: అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ



చిట్యాలలో..

కన్నాయిగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కన్నాయిగూడెం ఎంఈఓ రాజేష్ కుమార్ అన్నారు. మండలంలోని గుర్రేవులల్లో ప్రధానోపధ్యాయుడు అచ్చ అంజయ్య ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమానికి ఎంఈఓ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసుతులు ఉన్నాయన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంతో పాఠశాలలు సుందరంగా తయారయ్యాయన్నారు. ప్రతీ విద్యార్థి ప్రభుత్వ బడిలోనే చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ రఘుపతి అన్నారు. గురువారం చల్లగరిగ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటా బడి బాట కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మనఊరు-మనబడి కార్యక్రమాన్ని చేపట్టి ప్రతీ పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలు కలిగి ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంటింటా తిరిగి విద్యార్థులతో ర్యాలీ చేపట్టి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగవాన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ క్రాంతి



ఇంటి వద్దకు వెళ్లి పరీక్ష చేస్తున్న వైద్యుడు

వాజేడు: మండల పరిధిలోని బిజినేపల్లి, మొరుమూరు గ్రామాల్లో మాతా శిశు సంరక్షణ వైద్యాధికారి క్రాంతి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి గర్భిణులతో పాటు బాలింతలను పరిక్షీంచి మందులను అందజేశారు. చిన్న పిల్లలకు ప్రత్యేక పరీక్షలను చేశారు. వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రెండు గ్రామాల్లో 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జ్వరంతో బాధ పడుతున్న ముగ్గురి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది కోటిరెడ్డి, కన్యాకుమారి, రాజేశ్వరి ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వెంకటాపురం(కె): చిన్నారులు పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ముత్తమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జక్కుల వారి వీధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ముత్తమ్మ మాట్లాడుతూ.. గ్రామంలోని చిన్నారుల ను అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా గ్రామస్తులు చూడాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో వారికి కావాల్సిన పౌష్టికాహారం అందిస్తారని అన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, రాయసీత, వెంకటరమణ ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 16 వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం రాంనగర్ సుభాష్ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్ లో బడిబాట కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కౌన్సిలర్ శ్రీనివాస్ హాజరై పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి మాట్లాడారు. పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపిస్తే పౌష్టికాహారంతో కూడినఅన్ని సౌకర్యాలు అందుతాయని, దీంతో ఆరోగ్యంగా ఉంటారని తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఉమామహేశ్వరి అరుణ ఉన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవ పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ జగదీశ్



పూజలు చేస్తున్న కాకులమర్రి లక్ష్మణ్‌బాబు



గోవుకు పూజ చేస్తున్న అర్చకులు, మహిళలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని నాభిశిల బొడ్రాయి వార్షికోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బొడ్రాయి నెలకొల్పి 10 సంవత్సరాలు పూర్తి అయి 11 అవుతున్న సందర్భంగా బొడ్రాయి ఉత్సవాలను చేపట్టారు. భక్తులు ఉదయం పోతరాజు, భూలపల్లి, బొడ్రాయికి జలాభిషేకం, పాలభిషేకాలను అర్చకుడు యల్లప్రగడ రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే మండపారాదాన, హోమం, గోవు పూజ కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈసం రామ్మూర్తి, పోగుల లక్ష్మీనారాయణ, పిట్టల శ్రీనివాస్, దీనభాందుస్వామి, కత్తెర శ్రీనివాస్, అలువాల శ్రీనివాస్, జాస్తి శ్రీకాంత్, సప్పిడి రాంనర్సయ్య, కాళ్ల రామకృష్ణ, జయంత్, శ్రీకర్, గండెపల్లి నర్సయ్య, ఖాజా, గుండ్లపల్లి సత్యం, గుండ్లపల్లి నాగరాజు, బిల్ల శ్రీను, బిల్ల నాగరాజు, బేతి భాస్కర్, కనకయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీతక్క పూజలు

బొడ్రాయి కొలుపు ఉత్సవాలకు ములుగు ఎమ్మెల్యే సీతక్క హాజరై గరువారం బొడ్రాయికి, పోతరాజులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బొడ్రాయి కమిటీ సభ్యులు సీతక్కను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు యల్లప్రగడ రాధాకృష్ణశర్మ, కమిటీ సభ్యులు రాంబాబు, రమేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, పీ శ్రీనివాస్, డీఎస్ స్వామి, రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, దేవేందర్ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ పూజలు

బొడ్రాయి ఉత్సవాల సందర్భంగా జెడ్పీ చైర్మన్ జగదీష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు హోమంలో పూజలు చేసి బొడ్రాయికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, తాడూరి రఘు, మండల పార్టీ అధ్యక్షుడు సునీల్‌కుమార్, తుమ్మ మల్లారెడ్డి, ప్రదీప్‌రావు సప్పిడి రాంనర్సయ్య పాల్గొన్నారు.



బొడ్రాయి వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

బియ్యం అందజేత



నివాళులర్పిస్తున్న తస్లీమా

వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి చెందిన బుర్ర ఆదినారాయణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ములుగు సబ్ రిజిస్ట్రార్ తస్లీమా గురువారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున 50 కిలోల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రాజెక్టులతో తెలంగాణలో జలకళ

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల: సీఎం కేసీఆర్ చేపట్టిన భారీ నీటి ప్రాజెక్టలతో తెలంగాణ మొత్తం జలకళ సంతరించుకుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు, మండలంలోని వెల్లంపల్లి, సోమనపల్లిలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మన ఊరు-మన చెరువుల్లో భాగంగా మత్స్యశాఖ దినోత్సవానికి ప్రత్యేక అతిథిగా హాజరై మాట్లాడారు. మత్స్యశాఖపై అధారపడి జీవిస్తున్న ఎంతో మంది కార్మికులకు సీఎం కేసీఆర్ అండగా ఉంటూ, ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. భారీ ప్రాజెక్టలతో పాటు గ్రామాల్లోని చెరువులు, కుంటలను మిషన్ భగీరథ పథకం ద్వారా అభివృద్ధి చేసి, ప్రాజెక్టల నీళ్లను చెరువులు, కుంటల్లోకి మళ్లించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. చేప పిల్లల పంపిణీలో సబ్సిడీ అందిస్తూ ఆర్థికంగా వృద్ధి చెందేందుకు భరోసా కల్పిస్తున్నారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం సమీకృత మత్స్య అభివృద్ధి కోసం రూ.1000 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. రాష్ట అభివృద్ధిని దేశం చూస్తుందని, ప్రతిపక్షాల మాటలను నమ్మి మోసపోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవి, తిరుపతి, మత్స్యసహకార సంఘం నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

అక్రమ పట్టాలను రద్దు చేయాలి

మంగపేట: మండలంలోని గిరిజనేతరులకు 2018లో అప్పటి తహసీల్దార్ అంటి నాగరాజు అక్రమంగా చేసిన పట్టాలను రద్దు చేయాలని మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతమైన మండలంలోని ఆదివాసీ గిరిజనులకు చెందాల్సిన 75 వేల ఎకరాల ప్రభుత్వ భూములను తహసీల్దార్ నాగరాజు గిరిజనేతరులకు అక్రమంగా పట్టాలు చేశాడని ఆయన ఆరోపించారు. జిల్లా సరిహద్దు గ్రామం అకినేపల్లిమల్లారంలో సర్వే నంబర్ 53, 54 లో 05 ఎకరాల ప్రభుత్వ భూమిపై గిరిజనులకు పట్టాలు ఇవ్వాల్సి ఉండగా ట్రైబల్ ఏరియాలో ఎలాంటి రైట్స్‌లేని 1359 పస్లీ ప్రకారం నిషేధింపబడిన గిరిజనేతరుడు అయిన నాసిరెడ్డి సాంభశివరెడ్డి, స్నేహలతకు తహసీల్దార్ అక్రమంగా పట్టా చేశాడని ఆయన ఆరోపించారు. అదే విధంగా గ్రామంలో చాలా మంది గిరిజనేతరులకు అక్రమంగా పట్టాలు చేశాడని వారికి రద్దు చేయాలని డిమాండ్ చేశారు.